


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 114,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం, తేదీ : 25-08-2026

## ఒకేసారి వస్తున్న రైళ్లు - ఔటర్ల వద్దే పడిగాపులతో ప్రయాణికులకు నరకం



- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు
- పరిమిత ప్లాట్‌ఫారమ్‌లు ఉండటంతో తప్పని ఇబ్బందులు
- ఖాళీ లేక ఔటర్ సిగ్నళ్ల వద్దే రైళ్ల నిరీక్షణ
- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు
- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు

ఢిల్లీ : రైల్వే అధికారుల సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. లోపభూయిష్టమైన రైల్వే షెడ్యూళ్లు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు గుంటూరు స్టేషన్‌కు వచ్చేలా టైమ్‌టేబుల్ రూపొందించారు. పరిమిత ప్లాట్‌ఫారమ్‌లు, ట్రాక్‌లు ఉన్న స్టేషన్లలో మిగతా..2లో

## తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం



- బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణలో రెండ్రోజులు అతిభారీ వర్షాలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు మళ్లీ ఊపందుకున్నాయి. రానున్న రెండు రోజుల పాటు (ఆగస్టు 24, 25 తేదీల్లో) రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ సూచన ప్రకారం, సోమవారం కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి మిగతా..2లో

## జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్




- తెలంగాణలో 121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే..
- జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం జారీ చేస్తున్నారంటూ మండిపడ్డారు.

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై

## సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ
# కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!

- లండన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశం
- తెలంగాణలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం



హైదరాబాద్: : లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణ, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. పెట్టుబడులే లక్ష్యంగా 3 రోజుల పాటు లండన్‌లో పర్యటించిన సీఎం విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని భారత్‌కు చేరుకున్నారు. ఈ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా చేరుకొని ఘన స్వాగతం పలికారు. మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు : రాజకీయ అంశాలపై హైదరాబాద్ వచ్చిన తర్వాత అన్ని మాట్లాడతానని సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మూడ్రోజుల లండన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశంపై బలమైన మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మిగతా..2లో

## 22పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్న ప్రతిపక్షాలు

- హైదరాబాద్‌లో 22పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు.
- ఈ అంశంపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయన మండిపడ్డారు.



హైదరాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్‌లో 22ఏపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 22పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయా పార్టీలపై మండిపడ్డారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని తెలిపారు. నిజమైన (జెన్యూన్‌గా) వాటిలో 98 శాతం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. చేయలేనివి చేయలేమని తేల్చి చెప్పామని వివరించారు. అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొందరు దొంగ జీవోలు, మిగతా..2లో

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్.. 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు




- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పై జేయూఐఎఫ్ నేత ఫజ్లుర్ రెహ్మాన్ ఆగ్రహం
- 1971 యుద్ధ ఓటమిని ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిస్థితులపై హెచ్చరిక
- నిరంతర అణచివేత కొత్త భౌగోళిక సరిహద్దులకు దారితీస్తుందని వ్యాఖ్య
- ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సైన్యం సంబరాలు చేసుకోవడం సరికాదన్న మౌలానా

ఢిల్లీ : పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం

## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?
### రాహుల్‌పై సీఎం యోగి

- రాహుల్ గాంధీపై యోగి ఆదిత్యనాథ్ ఘాటు విమర్శలు
- మనుస్మృతిపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన యూపీ సీఎం
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి భారత సంప్రదాయాలను అవమానిస్తున్నారని ఆరోపణ
- ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్



ఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ లో కీలక రాజ్యాంగబద్ధ పవిలో ఉన్న రాహుల్, ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు భారత సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని పదేపదే కించపరుస్తున్నారని ఆరోపించారు. మనుస్మృతిపై రాహుల్ ఇటీవల మహారాష్ట్రలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, మిగతా..2లో

## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
# ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
### మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం
- 2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు
- రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు




- ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్

ఢిల్లీ : తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు.

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా




- పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి
- విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి
- ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య

అమరావతి: తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..
# గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

- దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ
- సీడ్ ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు
- 11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం
- రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు
- చింతలపూడి పథకం పూర్తి చేసి నూజివీడు రూపురేఖలు మారుస్తామని హామీ




అమరావతి : వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గౌర్మే పాప్‌కార్నికా' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గౌర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు. 2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో మిగతా..2లో

## ఏపీకి ఉపరాష్ట్రపతి.. స్వాగతం పలికిన నారా లోకేశ్

- ఏలూరు జిల్లాలో పర్యటిస్తున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న విత్తనాన్ని ఆవిష్కరించనున్న ఉపరాష్ట్రపతి
- ఈ కార్యక్రమంలో పాల్గొననున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు
- ఇది రైతులకు మేలు చేకూర్చే కీలక ముందడుగు అన్న మంత్రి నారా లోకేశ్
- ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



అమరావతి : భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొనేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గన్నవరం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాలుపంచుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, ముసునూరు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా

ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ
## కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!

దేశ ప్రయోజనాల కోసం ఈ విషయంలో అండగా నిలిచిన పార్టీ, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు అంటూ రాసుకొచ్చారు. రాజకీయ కారణాలతోనే ఆపేశారు : లండన్‌లో షెడ్యూలు ప్రకారం సమావేశాలు, కార్యక్రమాలను ముగించినట్లు సీఎం తెలిపారు. ముందస్తు షెడ్యూలు ప్రకారం బోస్టన్‌కు వెళ్లాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు పర్మిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను తెలంగాణకు తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఐవీలీగ్, ప్రపంచ అత్యున్నత సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే యువత ఆకాంక్షలకు ఈ పర్యటన సమాధానంగా నిలిచేదన్న సీఎం రేవంత్ రెడ్డి దేశ నిర్మాణం, యువత భవిష్యత్తుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ లో నేతల తీరుపై చర్చించి నేడు ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

## 22పై కొత్త కథలు అల్లి ప్రజలను
## భయపెడుతున్న ప్రతిపక్షాలు

మెమోలు తెచ్చి రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాదని మంత్రి పొంగులేటి కుండ బద్దలు కొట్టారు. సిఎస్7, సిఎస్ 14పై దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెర ముందు సామాన్యులను పెట్టి వెనక తమ ఎజెండాను అమలు చేస్తున్నారని అన్నారు. వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఖరీదైన కార్లు తీసుకుని సిఎస్7, సిఎస్14 భూములు రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ విషయాన్ని లేవనెత్తడంతో వివాదంలో పడ్డాయని వివరించారు. ఆ 811 ఎకరాల భూములపై విచారణకు సిద్ధమా? అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సర్వే నంబర్ 403లో సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉంటుందని అన్నారు. ఆ సర్వేలో1,288 ఎకరాలు ఉండగా రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల ఆ సర్వే మొత్తం నిషేధిత జాబితాలోకి వెళ్లితే సరిచేశామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

## జాబ్ నోటిఫికేషన్లు నిల్..
## లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

### 121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

## తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం

అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇవి కాకుండా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. వర్షం సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ నగరం, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల సమీపంలో నివసించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
## ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.


## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్..
## 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు

(జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93,000 మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

మొదటి పేజి తరువాయి

17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో విలువ జోడింపు (ఖుశ్రీబవ-ూాఽఽఞఱశీఅ) ప్రాధాన్యతను వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే, వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60-70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని




విశ్లేషించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు. "గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. ఇదే స్ఫూర్తితో గంగ-బ్రహ్మపుత్ర నదుల నీటిని కూడా సద్వినియోగం చేసుకోగలిగితే దేశ భవిష్యత్తు అప్రతిహతంగా ముందుకు సాగుతుంది" అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీని వ్యవసాయంతో అనుసంధానించి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వస్తే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని సూచించారు. గౌర్మే సంస్థ చూపిన 'అవుట్ ఆఫ్ బాక్స్' ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి ఉపరాష్ట్రపతి.. స్వాగతం పలికిన నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

గ్రామంలోని గౌర్మెట్ పాప్‌కార్న్ పరిశ్రమ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా, ఆ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి లాంఛనంగా ఆవిష్కరిస్తారు. అనంతరం పాప్‌కార్న్ సాగు చేస్తున్న మొక్కజొన్న రైతులను సత్కరించనున్నారు. వ్యవసాయ రంగంలో ఇది ఒక ముఖ్యమైన ఆవిష్కరణగా భావిస్తున్నారు. ఈ పర్యటనపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఏలూరుకు స్వాగతం పలకడం ఆనందంగా ఉందని తెలిపారు. "రైతుల కోసం ఆవిష్కరణలు, వారికి మరింత విలువను సృష్టించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి భద్రతా సిబ్బంది, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు, కృష్ణా జిల్లాల ఎస్పీలతో కూడిన ఉన్నత స్థాయి బృందం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించి భద్రతను సమీక్షించింది. ఉపరాష్ట్రపతి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని,



అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మునుమూరుకు ప్రయాణమయ్యారు.

# ఒకేసారి వస్తున్న రైళ్లు - ఔటర్ల వద్దే పడిగాపులతో ప్రయాణికులకు నరకం

మొదటి పేజి తరువాయి

ఒకే సమయంలో రైళ్లు వస్తున్నాయి. లేదా కేవలం ఒకట్రెండు నిమిషాల వ్యవధిలో వేర్వేరు రైళ్లు వచ్చేలా షెడ్యూల్ చేశారు. దీనివల్ల ప్రయాణికులకు తీవ్ర అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ముందు వచ్చిన రైలుకు ప్లాట్‌ఫారమ్ ఇస్తే, వెనుక వచ్చిన రైళ్లు ఔటర్ సిగ్నళ్ల వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఒక్క నిమిషం వ్యవధిలోనే రాకపోకలు : ప్రధాన స్టేషన్లలో రైళ్ల రాకపోకల షెడ్యూల్ అస్తవ్యస్తంగా మారింది. ఇతర ఓవర్ ల్యాపింగ్ రైళ్లతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉదాహరణకు సికింద్రాబాద్-అనకాపల్లి ఎక్స్‌ప్రెస్ (17043) సోమవారం తెల్లవారుజామున 3.29 గంటలకు గుంటూరు స్టేషన్‌కు చేరుకోవాలి. సరిగ్గా ఒక్క నిమిషం వ్యవధిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) 3.30 గంటలకు రావాలి. సికింద్రాబాద్-నహర్‌లాగూన్ (07046) మధ్యాహ్నం 1.20 గంటలకు గుంటూరు స్టేషన్ నుంచి నిష్క్రమించాల్సి ఉంది. సరిగ్గా అదే సమయానికి (మధ్యాహ్నం 1.20 గంటలకు) మార్కాపురం-తెనాలి మెము (67239) చేరుకోవాలి. ఇలాంటి షెడ్యూళ్ల వల్ల ఏ రైలుకు ఎక్కడ ప్లాట్‌ఫారమ్ ఇవ్వాలో తెలియక సిబ్బంది సైతం తలలు పట్టుకుంటున్నారు. ఒకే సమయానికి క్రాసింగ్‌లు : కాకినాడ-ఎల్‌టీటీ




ఎక్స్‌ప్రెస్ (17221) మధ్యాహ్నం 1.40 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. కటిహార్-యశ్వంత్‌పూర్ (06752) రైలు సరిగ్గా 1.40 గంటలకే స్టేషన్‌లోకి రావాల్సి ఉంది. చర్లపల్లి-నాగర్‌కోయిల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (16358-శనివారం), డోన్-గుంటూరు ప్యాసింజర్ (17227-రోజువారీ) రైళ్లు రెండూ సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు జంక్షన్‌కు చేరుకునేలా షెడ్యూల్ చేశారు. ఒకే సమయంలో రెండు రైళ్లు రావడం వల్ల ఒక రైలుకు ప్లాట్‌ఫారమ్ ఇస్తే, మరొక రైలును ఔటర్ సిగ్నల్ వద్ద నిలిపేయాల్సి వస్తోంది. దీంతో ఆయా రైళ్లలోని ప్రయాణికులు చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోంది. ఒకేసారి మూడు రైళ్లు : రెండు రైళ్లు ఒకేసారి రావడమే కష్టం అనుకుంటే, ఏకంగా మూడు రైళ్లకు ఒకే సమయాన్ని కేటాయించారు. సిల్చార్-చర్లపల్లి (15646-శుక్రవారం), చర్లపల్లి-అగర్తల (17031-సోమవారం), నరసాపురం-హుబ్లి అమరావతి ఎక్స్‌ప్రెస్ (17225-రోజువారీ) రైళ్లు ఒకే సమయానికి నమోదు కావడం గమనార్హం. ఈ మూడు రైళ్లు ఉదయం 9.05 గంటలకు వచ్చి 9.10 గంటలకు బయల్దేరేలా సమయం ఇచ్చారు. రోజువారీ మెము రైళ్ల పరిస్థితీ ఇంతే. రేపల్లె-గుంటూరు (67234), నరసాపురం-గుంటూరు (67247) ప్యాసింజర్ రైళ్లు రాత్రి 7.55 గంటలకు ఒకేసారి గుంటూరు జంక్షన్ చేరుకునేలా షెడ్యూల్ వేశారు. అర్ధరాత్రి కూడా ఆగని తిప్పలు : పగటి పూటే కాదు రాత్రి వేళల్లో కూడా ఈ ఓవర్ ల్యాపింగ్ సమస్య వేధిస్తోంది. చర్లపల్లి-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (17077) బుధవారం రాత్రి 11.50 గంటలకు స్టేషన్‌కు వస్తుంది. 12 గంటలకు బయల్దేరుతుంది. సరిగ్గా అదే సమయంలో విశాఖపట్నం దురంతో (22204) రాత్రి 11.53 గంటలకు వచ్చి 11.55 గంటలకు వెళ్తుంది. ఈ రెండు రైళ్ల రాకపోకల మధ్య ఉన్న గ్యాప్ కేవలం నిమిషాలే. స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్‌లు ఖాళీ లేక ఔటర్ వద్ద రైళ్లను ఆపేస్తుండటంతో గమ్యస్థానాలకు చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి, రైళ్ల షెడ్యూళ్లలో ఉన్న లోపాలను సరిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?'
# రాహుల్‌పై సీఎం యోగి ఫైర్

మొదటి పేజి తరువాయి

మనువు గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ గ్రంథాలను చదవాలని సూచించారు. ఉత్తర్ ప్రదేశ్ లోని రాయ్ బరేలీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవల మహారాష్ట్రలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను గురించి చెబుతున్నా. మహిళలు మనుస్మృతి సంకెళ్ల నుంచి బయటపడాలని రాహుల్ పిలుపునిచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు ఉన్నాయి. కేవలం రాహుల్ గాంధీగా ఆయనపై దేశ ప్రజలకు పెద్దగా అంచనాలు లేవు. అయితే ప్రతిపక్ష నేత హోదాలో మాత్రం ప్రజాస్వామ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. మీరు భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రమాణం చేశారు. కానీ భారత సంప్రదాయాలు, వారసత్వాన్ని అవమానించడం మీ జన్మహక్కుగా భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. మనుస్మృతిపై వ్యాఖ్యలు చేసే ముందు ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. మనువు గురించి తెలుసుకోవాలంటే అథర్వవేదం, శతపథ బ్రాహ్మణం, మత్స్య పురాణం వంటి గ్రంథాలను చదవాలి. మనువు, భారతీయ సంప్రదాయాలపై పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదు.

### యోగి ఆదిత్యనాథ్, ఉత్తర్ ప్రదేశ్ సీఎం
### ఎమర్జెన్సీపై వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటాన్ని కూడా సీఎం యోగి తప్పుపట్టారు. 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ, ఆ పార్టీ చరిత్రను గుర్తు చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేత వ్యవహరిస్తున్న తీరు అందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు యూపీని, విదేశాలకు వెళ్తే భారత్‌ను కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఉగ్రవాదంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా దేశ వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహం ఇచ్చేలా ఉన్నాయని విమర్శించారు. అయోధ్యలో శ్రీరాముడి ఉనికినే కాంగ్రెస్ ప్రశ్నించిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ వైఖరిని తప్పుపట్టారు.

### జంతర్ మంతర్ ఘటనపైనా ప్రస్తావన

ప్రధాని నరేంద్ర మోదీపై జంతర్ మంతర్ వద్ద ఓ యువతి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారమైన వివాదాన్ని కూడా సీఎం యోగి ప్రస్తావించారు. అయితే ఆ యువతి, ఆమె తల్లి తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారని తెలిపారు. 'రాజకీయ విమర్శలకు కూడా కొన్ని హద్దులు ఉండాలి. అర్బన్ నక్సల్స్ చేతిలో దేశ యువత భవిష్యత్తును ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు? భారత వారసత్వాన్ని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటున్నారు? దేశ భవిష్యత్తును ఎందుకు ప్రమాదంలోకి నెట్టాలనుకుంటున్నారు? ప్రతిపక్ష నేతగా రాహుల్ పార్లమెంట్‌లో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని దేశం ఆశించింది. కానీ ఆ అవకాశాన్ని ఆయన వృథా చేసుకున్నారు. అమేఠీ,



రాయ్ బరేలీ ప్రాంతాల ప్రజలు గాంధీ కుటుంబానికి మద్దతు ఇస్తున్నాయి. అయినప్పటికీ ఆ కుటుంబ రాజకీయాల కారణంగా ఆ ప్రాంతం గుర్తింపు సంక్షోభం ఎదుర్కొంటోంది' అని యోగి ఆరోపించారు. ఇటీవల ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సాంప్రదాయ సమాజంలో మహిళలను కేవలం కూతురు, భార్య లేదా తల్లి అనే మూడు బాక్సులకే పరిమితం చేసే ధోరణి ఉందని విమర్శించారు. ఆ పాత్రల్లో తప్పు లేనప్పటికీ, మహిళల గుర్తింపు కేవలం వాటికే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. . మహిళలు తమ గుర్తింపును తామే చాటుకోవాలని, ఎవరికీ తలవంచకుండా హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. పితృస్వామ్య భావజాలాన్ని ధైర్యంగా ఎదుర్కొని తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలన్నారు.

# భారత జుఎవీలకు ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లేదు: సీఈసీ జ్ఞానేశ్ కుమార్

### దేశ భవిష్యత్తుకు యువతే ప్రధానం- సరైన అవగాహనతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం
### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు

భారత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల(ఈవీఎం) గురించి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని, వీటికి ఇంటర్నెట్ , బ్లూటూత్ , వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, సోమవారం లఖ్ నవూలోని చారిత్రాత్మక కాల్విన్ తాలూక్ దార్ కాలేజీ విద్యార్థులతో ముచ్చటించారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల విశ్వసనీయం, యువ ఓటర్ల ప్రాధాన్యత గురించి వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. "దేశంలో ఎన్నికల ప్రక్రియ కోసం ఉపయోగించే ఈవీఎంలను ప్రభుత్వ రంగ కంపెనీలే ఉత్పత్తి చేస్తాయి. వీటికి ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండదు. అలాగే బ్లూటూత్ , వైఫై కనెక్షన్ లేదా ఇతర వైర్ లెస్ టెక్నాలజీలతో అనుసంధానం ఉండదు" అని జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో, విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు, లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు, కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని సీఈసీ సూచించారు.

### చిన్ననాటి జ్ఞాపకాలు

ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 1979లో తాను విద్యార్థిగా ఉన్న రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తన జీవిత ప్రయాణాన్ని తీర్చిదిద్దడంలో తన పాఠశాల ఉపాధ్యాయులు ఎంతటి ముఖ్యమైన పాత్ర పోషించారో చెప్పారు. తాను అమెరికా వెళ్లడానికి సిద్ధమవుతున్న రోజులను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. తన తల్లి కోరిక, మాతృభూమిపై ఉన్న మక్కువ కారణంగా తాను భారతదేశంలో ఉండి ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత తాను సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్ ) కేరళ కేడర్ లో చేరారని చెప్పారు. ప్రజాసేవలో భాగంగా తన ప్రయాణం చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యేలా చేసిందని ఆయన పేర్కొన్నారు.

ఇదొక భారీ టాస్క్

భారతదేశ ఎన్నికల ప్రక్రియ గురించి కూడా సీఈసీ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్ల కోసం ఎన్నికలు నిర్వహించడం ఒక భారీ టాస్క్ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగాలు రాత్రింబవళ్లు శ్రమిస్తారని ఆయన తెలిపారు. యువత ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను ప్రస్తావిస్తూ, 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని

# స్వర్ణోత్సవ సంబరాలలో ఘనంగా సత్కారాలు..



**విశాఖపట్నం, ఆగస్టు 24 : ప్రజా న్యూస్ నెట్వర్క్,విశాఖపట్నం,స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.**

జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారులైన ఇపిఎస్ భాగ్యలక్ష్మి మరియు వై. అనసూయ దేవి లను ఇటీవల జరిగిన సెయింట్ ఆన్స్ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలలో ఘనంగా సత్కరించారు. 25 సంవత్సరాలకు పైగా అధ్యాపకులుగా ఉంటున్నందుకు, సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నందుకు, జాతీయ మరియు రాష్ట్రస్థాయి అవార్డులను పొందినందుకు వీరికి ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథక అధికారులు, కార్యకర్తలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు వీరిని అభినందించారు. సెయింట్ ఆన్స్ సొసైటీ సుపీరియర్ జనరల్ సిస్టర్ పొలిన అగస్టీన్, విశాఖపట్నం ప్రోవెన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాండ్రీనా చేతుల మీదుగా వీరికి ఈ సత్కారం జరిగింది.

# చెరువుకు చేరాల్సిన జలాలకు చెక్ చేపల గుంతలకు మళ్లింపు



**అనంతసాగరం ఆగష్టు 24 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**

అనంతసాగరం చెరువుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న పల్లవోలు వాగు జలాలకు గౌరవరం వద్ద కొందరు అడ్డుకట్ట వేసి చేపల గుంతలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి దీంతో చెరువుకు చేరాల్సిన నీటి ప్రవాహం తగ్గిపోతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.వాగు ద్వారా చెరువులోకి చేరాల్సిన జలాలను మధ్యలోనే ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల రానున్న రోజుల్లో సాగునీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సాగు అవసరాల కోసం చెరువుపై ఆధారపడుతున్న రైతులకు నీటి ప్రవాహం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు.చెరువుకు చేరాల్సిన నీటిని మళ్లిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు గౌరవరం వద్ద పల్లవోలు వాగు నీటి మళ్లింపుపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు అక్రమంగా నీటిని మళ్లిస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, చెరువుకు నిరంతరాయంగా నీరు చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పేదరికంపై అవగాహన శిక్షణ తరగతులు




**అనంతసాగరం ఆగష్టు 24 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**

నెల్లూరు రాజ రా అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేదరికంపై అవగాహన శిక్షణ తరగతులునిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ. మొగిలి వెంకటేశ్వర్లు ఐఏఎస్ గారు హాజరవుతున్నట్లు కమిటీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎన్. జయశ్రీ తెలిపారు.ఈ నెల 29న నెల్లూరు నగరం బట్వాడిపాలెంలోని రా గ్రాండ్ హోటల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. కమిటీ జిల్లా ప్రచార కార్యదర్శి వెండిపల్లి శ్రీనివాసులు ఉదయగిరి నియోజకవర్గం అధ్యక్షులు గొల్లపల్లి జార్జి కమిటీ వర్గాలు అధికారికంగా తెలిపారు.

# భారీ వర్షానికి జలమయమైన తేనెపల్లి తండా.. ఇళ్లలోకి చేరిన నీరు

### - ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్




**గుర్రంపోడు, ఆగస్టు 24: నల్లగొండ జిల్లా గుర్రంపోడు ప్రజా న్యూస్ రిపోర్టర్ దోటి.శ్రీను**

మండల పరిధిలోని తేనెపల్లి తండాలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం తీవ్ర కలకలం రేపింది. కుండపోతగా కురిసిన ఈ వర్షం కారణంగా తండాలోని పలు ఇళ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఇళ్లలోని నిత్యావసర వస్తువులు, బట్టలు, ధాన్యపు గింజలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. సర్వస్వం కోల్పోయిన గిరిజన కుటుంబాలు తినడానికి తిండి, ఉండటానికి నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.తండాకు చెందిన వడిత్య శివాజీ, వడిత్య మల్లేష్, వడిత్య బద్య, వడిత్య మంగ్తా, వడిత్య పాండు, వడిత్య అఖిల్, వడిత్యా నంద్య, వడిత్య బాలుల ఇళ్లలోకి మోకాళ్ళ లోతు వరద నీరు వచ్చి చేరింది,తమ ఇళ్లు లోతట్టు ప్రాంతాలుగా మారిపోవడంతో వర్షపు నీరంతా బయటకు పోవడానికి దారి లేక నేరుగా ఇళ్లలోకి వస్తోందని, ఇప్పుడు కనీసం ఇంట్లో నిద్రించే పరిస్థితి కూడా లేదని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.ఈ విషయమై తండా మాజీ సర్పంచ్ వడిత్య నాగరాజు మరియు బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన తండాలో మురికి కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా ఇళ్లలోకి నీరు చేరకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తీవ్రంగా నష్టపోయిన ఈ గిరిజన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, వారికి 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేసి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గ్రామపంచాయతీ తీర్మానాల అమలులో అవకతవకలపై ఆరోపణలు

### తీర్మానం చేసిన పనులు కాకుండా ఇతర పనులు చేపడుతున్నారని ఫిర్యాదు




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

చింతలపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం ఆరు దరఖాస్తులు అందాయి. వీటిలో నాలుగు పంచాయతీరాజ్ శాఖకు, రెండు విద్యుత్ శాఖకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. చింతలపాలెం గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానాల అమలులో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ 11వ వార్డు సభ్యురాలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ వార్డులో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, స్మశానవాటికలో బోరు, మట్టి తోలించడం తదితర పనులకు తీర్మానాలు చేసినప్పటికీ వాటిని చేపట్టకుండా తీర్మానం లేని ఇతర పనులు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆరోపణలపై సర్పంచ్ వివరణ ఇస్తూ గ్రామంలో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుగా, వెనుకగా చేపడుతున్నామని, తీర్మానం చేసిన పనులనే అమలు చేస్తామని తెలిపారు.

# పుల్లనీళ్లపల్లెలో నేడు భగవాన్ వెంకయ్య స్వామి 28వ ఆరాధనా మహోత్సవం




**నెల్లూరు జిల్లా చేజర్ల ఆగష్టు 24 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**

నెల్లూరు జిల్లా చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లె గ్రామంలో భగవాన్ వెంకయ్య స్వామి 28వ ఆరాధన మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ఈ మేరకు ఆలయ వ్యవస్థాపకులు, ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో రోజంతా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పూజా ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు.అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రత్యేక పూజలు, ప్రసాద వినియోగ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. రాత్రి 7.30 గంటలకు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం, 9 గంటలకు భగవాన్ వెంకయ్య స్వామివారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆరాధన మహోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పల్లకి సేవతో పాటు జరిగే గ్రామోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆరాధన మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి భగవాన్ వెంకయ్య స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కొమ్మి లక్ష్మయ్య నాయుడు కోరారు.

# సూర్యాపేట మున్సిపాలిటీ సమస్యల సుడిగుండంలో.. రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

### మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు పట్టణ సమగ్రాభివృద్ధికి రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి ఆగస్టు 20 వరకు సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో అనేక వార్డుల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలువల్లో పూడిక తొలగించకపోవడం, పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టకపోవడం, ఫాగింగ్ నిర్వహించకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, వాడుక నీటి సమస్యలు కొనసాగుతున్నాయని, పట్టణ పరిసరాల్లో నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సమర్థంగా వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. చెరువులను పునరుద్ధరించి పట్టణ ప్రజలకు అవసరమైన నీటి వసతులను మెరుగుపరచాలని కోరారు. చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయించి వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, 60 ఫీట్ రోడ్డును కలెక్టరేట్ రోడ్డుతో అనుసంధానిస్తూ హైటెక్ బస్టాండ్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. కొత్త బస్టాండ్ నుంచి ఇమ్మాంపురం ఫ్లైఓవర్ వరకు, గాంధీ బొమ్మ నుంచి కుసుమవారిగూడెం వరకు రహదారులను నాలుగు లైన్లుగా విస్తరించాలని, పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ప్రజాధనంతో నిర్మించినప్పటికీ ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మున్సిపాలిటీ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజా సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయని అన్నారు. వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను చేపట్టాలని సూచించారు. పట్టణ సమస్యలపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని గుమ్మడి నర్సయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు గొడ్డలి నరసయ్య, జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 కోట్లతో ఈకే పేట తండా-రామాపురం బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

### గ్రామీణ ప్రాంతాల రహదారి అభివృద్ధికి మరో ముందడుగు




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి ::**

నడిగూడెం మండలం ఈకే పేట తండాలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఈకే పేట తండా నుంచి రామాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఈకే పేట తండా, రామాపురం గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సూచించారు. రహదారి నిర్మాణంతో పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా మరింత అవకాశం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా నేటి నుంచి సామూహిక మొక్కలు నాటాలి-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

వనమహోత్సవం లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 25 నుంచి జిల్లా వ్యాప్తంగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్క సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి అవి తప్పనిసరిగా బతికేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లు, అటవీ, దేవాదాయ శాఖ అధికారులతో వనమహోత్సవంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు, గ్రామాల వారీగా విస్తృతంగా నాటేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మండలంలో 10 వేల మొక్కలకు తగ్గకుండా నాటాలని, అన్ని మండలాల్లో 150 మందికి తగ్గకుండా కూలీలను సమీకరించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అటవీ ప్రాంతాలు, ఇతర అనువైన ప్రదేశాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటికి నిరంతరం నీరు అందించడం, రక్షణ కల్పించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలకు అనుకూల పరిస్థితులు ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 25 నుంచి ప్రారంభమయ్యే సామూహిక మొక్కల నాటే కార్యక్రమాన్ని సెప్టెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలని, దేవాలయాల పరిసరాల్లో కూడా ప్రత్యేకంగా మొక్కలు నాటాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు వనమహోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అధికారులు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి ధామోదరరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం

### మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల సమాజానికి ఎంతో ఉపయోగం ఉంటుందని, యువతతో పాటు ప్రజలు కూడా రక్తదానంపై అవగాహన పెంచుకుని ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు నమోదు చేయించాలి

### ముసాయిదా ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

పాలకవీడు మండలంలో అర్హులైన ప్రతి ఓటరు ఓటు నమోదు చేయించుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.వి. సుబ్బారావు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ నాయక్ అన్నారు. సోమవారం పాలకవీడు మండలం జానపహాడ్ దర్గా జేపీఎస్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి నాయకులకు ముసాయిదా ఓటరు జాబితాలను అందజేసి మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ముసాయిదా ఓటరు జాబితాలను బూత్ స్థాయి ఏజెంట్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జాబితాలో పేరు లేని అర్హులైన వారికి, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఫారం-6 ద్వారా సకాలంలో దరఖాస్తు చేయించి ఓటు నమోదు చేయించాలని తెలిపారు. అలాగే ఓటరు జాబితాపై నోటీసులు అందిన వారు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ కోఆర్డినేటర్లు మీసాల ఉపేందర్, పెరుమాళ్ల రమేష్, తోడేటి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఎల్ఏలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ మండలంలో ప్రజావాణి నిర్వహణ

### ప్రజల సమస్యలను స్వీకరించిన ఎంపీడీవో, తహసీల్దార్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

హుజూర్ నగర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూర్ నగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలు అందించిన దరఖాస్తులను ఎంపీడీవో సుమంత్ రెడ్డి, తహసీల్దార్ బండ కవిత స్వీకరించి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు, పింఛన్లు, ఇళ్లకు సంబంధించిన అంశాలు, గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అధికారులు నేరుగా అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. హుజూర్ నగర్ మండలంలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం పరిశీలించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుజూర్ నగర్ ఎంపీడీవో సుమంత్ రెడ్డి, తహసీల్దార్ బండ కవిత, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
మంగళవారం 25-08-2026

# ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

### కాకి పరాబ్ కుమార్ సేవలను గుర్తుచేసుకున్న మిత్రులు, పౌర సమాజ ప్రతినిధులు

### ఉద్యోగ జీవితంతో పాటు సామాజిక సేవల్లోనూ ప్రత్యేక ముద్ర వేసిన పరాబ్ కుమార్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజుర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుదీర్ఘకాలం ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహించి, అనంతరం నల్గొండ జిల్లా ఫార్మసీ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ జూన్ 2026లో ఉద్యోగ విరమణ చేసిన కాకి పరాబ్ కుమార్‌ను అభినందిస్తూ సోమవారం హుజుర్ నగర్ ప్రజా భవన్ టౌన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని మిత్రులు, సహచరులు, పౌర సమాజ ప్రతినిధులు గుర్తుచేసుకుని ఆయన సేవలను కొనియాడారు. 43 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో దాదాపు 25 సంవత్సరాలు హుజుర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవల్లో తనవంతు సహకారం అందించి మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడంతో పాటు సమాజం పట్ల తనకున్న బాధ్యతను గుర్తించి అనేక సామాజిక, సాంస్కృతిక, నిర్మాణాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ప్రగతిశీల ఆలోచనలు కలిగిన మిత్రులతో కలిసి స్పందన సామాజిక అధ్యయన వేదికను ఏర్పాటు చేసి సుమారు రెండు దశాబ్దాలుగా ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వామిగా నిలిచారని గుర్తుచేశారు. సమకాలీన సామాజిక సమస్యలు, రాజకీయ, ఆర్థిక అంశాలు, శాస్త్రీయ దృక్పథం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం వంటి అనేక అంశాలపై మేధావులు, నిపుణులతో సదస్సులు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంలో స్పందన వేదిక చేసిన కృషిలో పరాబ్ కుమార్ కీలక పాత్ర పోషించారని అన్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆలోచనలను ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో చేపట్టిన వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాల్లోనూ ఆయన తనవంతు బాధ్యతను నిర్వర్తించారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడం వంటి కార్యక్రమాల్లో పరాబ్ కుమార్ అందించిన సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. హుజుర్ నగర్‌తో ఆయనకు ఏర్పడిన అనుబంధం ఉద్యోగ విరమణతో ముగిసిపోలేదని, భవిష్యత్తులో కూడా పట్టణ ప్రజలతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాకి పరాబ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హుజుర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాముల శివరెడ్డి, హుజుర్ నగర్ మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, రోషపతి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు డాక్టర్ అందె సత్యం ఆత్మీయ అతిథిగా పాల్గొని పరాబ్ కుమార్ సేవలను అభినందించారు. ప్రజా కళాకారులు తమ గళాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్పందన మిత్రులు, హుజుర్ నగర్ పౌర సమాజ ప్రతినిధులు, మిత్రులు, సహచరులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యూపీ బీహార్ సోదరులు నిర్వహించే కావడి యాత్రలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 24 ప్రజా న్యూస్ నెట్వర్క్**
యూపీ బీహార్ లు శ్రావణమాసం, మహాశివరాత్రి సందర్భాలలో ప్రత్యేకంగా నిర్వహించే కావడి యాత్ర సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగు బస్తి నుండి హెచ్ఎంటి శివాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై కావడి ని మోసి బిహారీ భక్తులకు శ్రావణమాస శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పవిత్ర శ్రావణమాసంలో బిహారీలు పవిత్ర గంగాజలంతో శివునికి అభిషేకం చేయడం ద్వారా వారి మొక్కులను తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ అన్ని ప్రాంతాల ప్రజలకు, అన్ని మతాల ప్రజలకు నిలయంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ధర్మేందర్, మంజుల, జగదీష్ పాల్, రమేష్, రాజ్ కుమార్, సంతోష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ

### పాలకవీడు మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలి





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి**
:పాలకవీడు మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సీపీఎం పార్టీ మండల కమిటీ తరపున బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. గతంలో జానపహాడ్ దర్గా, గుండెబోయినగూడెం ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం సౌకర్యం లేక మహిళలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సూర్యాపేట నుంచి మహంకాళిగూడెం వరకు, మిర్యాలగూడ డిపో నుంచి గుండెబోయినగూడెం వరకు బస్సులు నడిపించాలని కోరారు. ముఖ్యంగా మహిళలకు మహాలక్ష్మి పథకం ప్రయోజనం అందేలా ప్రజా రవాణాను మెరుగుపరచాలని సీపీఎం మండల కార్యదర్శి కండగట్ల అనంత ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

# విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం-బొంగునూరి కిషోర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి తిరిగి చేరుకున్న సందర్భంగా తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కో-ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పుష్పగుచ్ఛంతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని శు భాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక ప్రగతి లక్ష్యంగా చేపట్టిన విదేశీ పర్యటన విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం అందిస్తామని బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'స్కిల్' పేరుతో సాంకేతిక విద్యకు సంకెళ్లా?




తెలంగాణలో పాలిటెక్నిక్, ఐటీఐ, ఏటీసీ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి విలీనం చేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 97తో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. దశాబ్దాలుగా సాంకేతిక విద్యా శాఖ పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యను కొత్త వ్యవస్థలో విలీనం చేయడంపై విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.. తమ విద్యా వ్యవస్థను సాంకేతిక విద్యా శాఖలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో పాలిటెక్నిక్ విద్యతో పాటు ఐటీఐ, ఏటీసీ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలలో పాలిటెక్నిక్ విద్య రెండు ముక్కలు కానుంది. పాలిటెక్నిక్‌తో పాటు ఐటీఐ, ఏటీసీ కాలేజీలు స్కిల్ యూనివర్సిటీ కిందకు, ఉద్యోగులంతా శక్తి శాఖ

### ఈ విద్యలో.. 70 శాతం ప్రాక్టికల్ నాలెడ్జ్!

పదవ తరగతి తరువాత ఉపాధి, ఉద్యోగం చేయాలనుకునే విద్యార్థులకు ఐటీఐ, పాలిటెక్నిక్ విద్య ఒక సువర్ణ అవకాశం లాంటివి. ఐటీఐ విద్య ఒక ఒకేషనల్ కోర్సు. ఇందులో ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై 70% కంటే ఎక్కువ శ్రద్ధ పెడతారు. యంత్రాలను ఎలా ఆపరేట్ చేయాలి.. రిపేర్ ఎలా చేయాలి? అనే 'క్రాఫ్ట్‌మెన్' నైపుణ్యాలను నేర్పుతారు. ఇక పాలిటెక్నిక్ విద్య ఓ డిప్లమా కోర్స్. దీనిలో థియరీ (ఇంజనీరింగ్ సిద్ధాంతాలు)తో పాటు ప్రాక్టికల్స్ సమా నంగా నేర్పుతారు.. ఒక ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ వెనుక ఉన్న సాంకేతికతను అర్థం చేసుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. డిప్లమా విద్య పూర్తి చేసుకున్న వేలాది విద్యార్థులు నేడు కేవలం సాంకేతిక రంగానికే పరిమితం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగులుగా, ఇస్రో, డీఆర్‌డీఓ, బీహెచ్ఈఎల్, ఎన్ఎఫ్‌సీ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థల్లో సైంటిస్టులుగా, ఇంజనీర్లుగా పనిచేస్తూ దేశ అభివృద్ధిలో భాగం అవుతున్నారు.. ఇక డిప్లమా తరువాత ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు ఈసెట్ ఎంట్రెన్స్ ద్వారా లాటరల్ విధానంతో ఇంజనీరింగ్ కోర్స్‌లలో 2వ సంవత్సరంలోకి నేరుగా ప్రవేశం లభి స్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా దాదాపు లక్ష మంది విద్యా ర్థులు చదువుతున్నారు. ఇందులో పేద పిల్లలే, అందు లోనూ బాలికలే ఎక్కువగా ఉన్నారు..

### ఈ యూనివర్సిటీకి నిధుల కొరత ఏర్పడితే..?

కానీ తెలంగాణ ప్రభుత్వం చీజ్రా-2020లో భాగంగా ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ప్ర్రా) మోడల్‌లో నడిచే ఈ యూనివర్సిటీ ద్వారా యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. 15 మందితో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ బోర్డులో ఏడుగురు మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు.. సీఎం రేవంత్‌రెడ్డి చాన్సలర్‌గా, మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా ఉన్నారు. యూనివర్సిటీకి ప్రభుత్వ, కార్పొరేట్ నిధులతో పాటు బ్యాంకులు, కార్పొరేషన్ల నుంచి నిధులు సమకూరనున్నాయి. దాతల సహకారంతో నిర్మించే భవనాలు, గదులు, కేంద్రాలకు వారి పేర్లు పెట్టే అవకాశం ఉంది. అయితే ఇతర విద్యాసంస్థలతో పోలిస్తే ఇక్కడ ఫీజులు అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్ర్రా మోడల్‌లో నిధుల కొరత ఏర్పడితే ఆ భారం విద్యార్థులపై పడే ప్రమాదం ఉంది. ఫీజుల కారణంగా భవిష్యత్తులో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి రావచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది విద్య పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమనే విమర్శలు ఉన్నాయి.

### అసంఘటిత కార్మికులను తయారయ్యే ప్రమాదం..

దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను కోట్ల విలువైన భూములతో సహా ప్ర్రా మోడ ల్‌లోని 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకురావడం వెనుక కార్పొరేట్ ప్రయోజనాలు ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ విధానం ద్వారా తక్కువ వేతనాలతో పనిచేసే అసంఘటిత కార్మికులను తయారు చేసే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాలిటెక్నిక్ విద్యార్థులకు పోరాటం కొత్త కాదు. గతంలో అనేక సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో వారు చురుగ్గా పాల్గొన్నారు. 1980లో 100 రోజుల చారిత్రక సమ్మె కూడా చేశారు.. అదే పోరాట స్ఫూర్తితో నేడు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా నిపుణులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి. ఁాదీజును కొనసాగిస్తూ నిధులు పెంచాలి. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను అభి వృద్ధి చేసి, వాటికి అవసరమైన నైపుణ్యాలను ఐటీఐలు, పాలిటెక్నిక్‌లలో అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి నిరుద్యోగాన్ని తగ్గించాలి.

# సంపాదకీయం

## ఆనాటి భారత్‌చైనా జ్ఞానమైత్రి ఇప్పుడూ కావాలి!

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తి అవుతున్న తరుణంలో 'కాక్రోచ్' పేరుతో వార్తల్లో క్రియాశీలంగా మారిన ఒత్తిడి గుంపులను మన మేధావులు కొందరు కేంద్ర ప్రభుత్వ వైఫల్య కోణం నుంచి చూస్తున్నారు. మరికొందరు అందులో మోదీ సర్కారు తప్పేమీ లేదు, చైనాలోని మన మేలుకోరని మేధావులతో కలిసి ఇక్కడి కొందరు చేస్తున్న కుట్రగా దీన్ని విమర్శిస్తున్నారు. ఇక ఆందోళనలు చేసిన వారిని 'కాక్రోచ్'లు అంటుంటే, చైనాలోని మేధావులను 'ఎలుకలు' అంటున్నారు. సమకాలీన పరిణామాలపై ఈ వ్యాఖ్యలు ఎలా ఉన్నా భారత్‌చైనాల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు ఈనాటివి కావు. క్రీ.శ. ఐదవ శతాబ్దిలో మొదలైన జ్ఞానశోధన భారతచైనాల మైత్రికి పునాదులు వేసింది. ఆధునిక భారత చరిత్రలో నెహ్రూ యుగంగా పరిగణించే కాలంలో ఆ శోధన ఒక స్ఫూర్తి అయింది. ఆనాడు భారత్ నుంచి చైనాకు పెద్ద ఎత్తున పండిత వర్గం వెళ్లి అక్కడ ఏళ్ల తరబడి నివాసం ఉండి వారికి సంస్కృతాన్ని బోధిస్తూ చీనీ భాషలోకి సంస్కృత గ్రంథాలను వారు తర్జుమా చేశారు. వారిలో ప్రముఖుడు కాశ్యప మాతంగ. క్రీ.శ. 67లో మింగ్ చి చక్రవర్తి ఆహ్వానంపై చైనా వెళ్ళిన కాశ్యప 'లో' నదీ తీరంలోని లోయాంగ్ పట్టణంలో నివాసం ఉన్నాడు. భారత్ నుంచి ఇలా చైనా వెళ్ళిన ప్రముఖుల్లో బుద్ధభద్ర, జినభద్ర, ధర్మరక్ష, కుమారజీవ, పారమార్థ, జినగుప్త, బోధిధర్మ మొదలైన వారు ఉన్నారు. వీరిలో ప్రతి ఒక్కరూ తమ శిష్యులతో, బౌద్ధ బిక్షువుల బృందాలతో కలిసి చైనాకు తరలివెళ్లారు. ఒక దశలో (క్రీ.శ. 6వ శతాబ్దికి) ఒక్క లియాంగ్ పరగణాలోనే మూడు వేల మంది భారతీయ బౌద్ధ భిక్షువులు, పది వేల భారతీయ కుటుంబాలు ఉండేవి. వీరు తమతో ఎన్నో సంస్కృత గ్రంథాలను అక్కడికి తీసుకుని వెళ్లి, వాటిని చీనీ భాషలోకి తర్జుమా చేశారు. వీరిలో కొందరు నేరుగా చీనీలో గ్రంథాలనూ రాశారు. కుమారజీవ చీనీ భాషలో 47 గ్రంథాలను రాసిన సుప్రసిద్ధ రచయిత. ఇక జీవగుప్త 37 సంస్కృత గ్రంథాలను చీనీ భాషలోకి అనువదించారు. వీరి రాకపోకలకు ఈ సారస్వత ఆదాన ప్రదానాలకు క్రీ.శ. 427లో ప్రారంభమైన మన నలంద విశ్వవిద్యాలయమే సమన్వయ కేంద్రంగా ఉండేది. ఇలా భారత్ నుంచి చైనా వెళ్ళిన పండితుల వద్ద అక్కడ శిష్యులుగా చేరిన చైనా ప్రముఖులు ఎందరో ఉన్నారు. ప్రముఖ యాత్రా చరిత్రకారుడుగా మన చరిత్ర గ్రంథాల్లో ప్రస్తావించే ఫాహియాన్ (క్రీ.శ. 337422) కుమారజీవకు శిష్యుడు. భారత్‌లో పర్యటనకు బయలుదేరే ముందు గురువు కుమారజీవను ఫాహియాన్ సంప్రదిస్తాడు. అప్పుడు కుమారజీవ ఇలా సలహా ఇస్తాడు: "భారత్‌లో నీ సమయమంతా మత సంబంధమైన జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికే వెచ్చించవద్దు. అక్కడి ప్రజలు, వారి జీవన విధానం కూడా క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యి; అప్పుడు చైనాకు ఆ దేశ ప్రజలను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది". చాలా ఆసక్తికరమైన అంశం ఇది. ఆసియాలోని ఇరుగు పొరుగు దేశాల మధ్య భవిష్యత్తులో ఏర్పడాల్సిన సత్సంబంధాల అవసరాన్ని నాటి పండితులు గుర్తించడం ఇందులో మనకు కనిపిస్తుంది. కుమారజీవ దూరదృష్టి ఫలితాలు హుయన్ త్సాంగ్ (602664) కాలంలో కనిపిస్తాయి. రెండు దేశాల పాలకుల దృష్టిలో హుయన్ త్సాంగ్ ఒక గౌరవనీయుడైన ఇరుదేశాల ప్రతినిధిగా గుర్తింపు పొందాడు. భారత్ నుంచి ఆయన తనతో చైనా తీసుకువెళ్ళిన 645 సంస్కృత గ్రంథాలను, అక్కడి చక్రవర్తుల సహకారంతో ఒక పండిత బృందాన్ని ఏర్పాటు చేసి వాటిని చీనీలోకి తర్జుమా చేయించాడు. హుయన్ త్సాంగ్ భారత్ నుంచి చైనా తిరిగి వెళ్ళిన తర్వాత, రెండు దేశాల మధ్య అప్పటి వరకు ఒకరి పట్ల మరొకరికి ఉన్న అభిప్రాయాలకు 'కొత్త చూపు' వచ్చి చేరింది. భారత్‌లో కనూజ్ రాజధానిగా పరిపాలిస్తున్న హర్షవర్ధనుడు చైనా టి యాంగ్ చక్రవర్తి ఇరువురూ స్నేహపూర్వకంగా రాయబారులను పంపుకున్నారు. ఆసియాలోని ఈ రెండు పెద్ద దేశాల మధ్య సారూప్యత గల అంశాలు స్పష్టమైన రూపుతీసుకున్నాక, వాటి ప్రభావం సమాంతరంగా తూర్పు ఆసియాలో ఉన్న చిన్న దేశాల్లో కనపడింది. ఈ దేశాలు తొలుత బ్రాహ్మణిజం ఆధిపత్యంలో ఉండి, తర్వాత క్రమంగా బౌద్ధంలోకి మారాయి. తొలుత ఈ రెండు మతాలూ ఒక దశ వరకు సామరస్యపూర్వకంగా ఉండేవి. తర్వాత వీటి మధ్య స్పర్థ మొదలయింది. అయితే ఆ స్పర్థ క్రమంగా పోరుగా మారడానికి మాత్రం కారణం ఆధ్యాత్మిక వైరం కాదు. అందుకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య కారణాలు ఉన్నాయి అంటారు నెహ్రూ. కాలక్రమంలో సముద్ర వాణిజ్య మార్గాల పైన గుత్తాధిపత్యం ఈ దేశాల మనుగడకు కీలకం అయింది. ఐదవ శతాబ్ది నాటికి ఈ దేశాల్లో మహా నగరాలు ఏర్పడ్డాయి. తొలుత జ్ఞాన తృష్ణను తీర్చుకోవడానికి మొదలైన ప్రస్థానం మనిషిని కొత్త తీరాలకు తీసుకువెళితే, కొత్త జాతులతో మొదలై విస్తరించిన స్నేహపూర్వక సంబంధాలు క్రమక్రమంగా వాణిజ్య కేంద్రంగా మారాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం, పలు మొదటి ప్రపంచ దేశాలను తాకిన స్థాయిలో మనల్ని తాకలేకపోయింది. ఆర్థిక సంస్కరణల అమలులో మన కంటే ముందు ఉన్న ఆసియా దిగ్గజం చైనా అప్పటికే ప్రపంచ మాంద్యం ప్రకంపనాలు తనని తాకకుండా నిలువరించగలిగింది. అది మొదలు క్రమక్రమంగా ప్రపంచ దేశాల దృష్టి యూరప్ నుంచి ఆసియా మీదికి మళ్ళింది. 18వ శతాబ్ది వరకు ప్రపంచ జీడీపీలో సగభాగం ఆసియాది అంటే అందుకు ఆశ్చర్యం అక్కరలేదు. అయితే, ఈ ఇరుదేశాల ప్రాధాన్యాల్లో ఇప్పుడు 'జ్ఞానం' మసకబారి 'విపణి' పెద్దపీట ఎక్కి కూచుంది. చైనా మళ్ళీ 'సిల్క్ రూట్' పునరుద్ధరణ అంటూ తన వాణిజ్య ఆబకు గత చరిత్ర సొబగులు అద్ది, 'వన్ బెల్ట్‌వన్ రోడ్' ప్రాజెక్టుతో 'ఆఫ్రోఆసియా' మ్యాప్ పైకి దూసుకువచ్చింది. స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వార్షిక నివేదిక ప్రకారం అత్యధిక సైనిక వ్యయంతో